క్లుప్తంగా

400 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు



గొర్రెలకు డీవార్మింగ్ మందులు వేస్తున్న పశువైద్యాధికారి పోలందొర

మక్కువ: మండలంలోని నగుళ్లు, కె.పెద్దవలస గ్రామాల్లో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాన్ని పశు వైద్యాధికారి కె.పోలందొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పోలందొర ఆవులకు వ్యాక్సిన్, ఆరోగ్య పరీక్షలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈనెల 31వరకు అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్యశిబిరాలు నిర్వహించి, ఆవులు, గొర్రెలు, మేకలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు జాతీయ బాలికల దినోత్సవం

పార్వతీపురంటౌన్: జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి డా.టి.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9గంటల నుంచి కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె ప్రకటనలో వివరించారు.

వచ్చే నెల 7న ఆశీలు, కబేళాల వేలం

పార్వతీపురంటౌన్: ఆశీలు, కబేళాల వేలం ఫిబ్రవరి 7న ఉదయం 11గంటలకు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్ ఆశీలు, కబేళాలలో ఆశీలు వసూలు చేసుకునే హక్కు కోసం బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చనని తెలిపారు.

గోతుల మయమైన కూర్మరాజుపేట రోడ్డు



సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట బీటీ రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా రాళ్లు తేలడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. మామిడిపల్లి రోడ్డు నుంచి కూర్మరాజుపేట గ్రామం మీదుగా పునికిన వలస గ్రామం వరకు రోడ్డుపై పూర్తిగా గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నామని రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

వృత్తివిద్యా కోర్సులపై విద్యార్థులకు అవగాహన

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం బొబ్బిలి పట్టణంలోని ఎస్.కె ఫ్యాషన్స్ కేంద్రంలో వృత్తివిద్య కోర్సులపై ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టైలరింగ్, మగ్గం వర్క్స్‌పై విద్యార్థులకు ఎం.సుధాకర్ భట్ల, ట్రైనర్ ఎ.ముత్యాలమ్మలు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుతోపాటు, వృత్తివిద్య కోర్సులపై అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు.

రేషన్ డీలర్ నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలి

పార్వతీపురంటౌన్: ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన రేషన్ డీలర్ పోస్టుల నియామకాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని సామాజిక చైతన్య వేదిక, ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ డీలర్ పోస్టుల నియామకంలో సంబంధిత పంచాయతీకు చెందిన వారికి కాకుండా వేరే పంచాయతీల అభ్యర్థులకు ఇచ్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

వాహనాల రికార్డులు కలిగి ఉండాలి

సాలూరు: వాహనదారులు తప్పనిసరిగా వాహన రికార్డులను కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు రహదారిభద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో వద్ద ప్రైవేట్ పాఠశాలల బస్సుల డ్రైవర్లు, సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడపరాదని అన్నారు. పాఠశాలల బస్సులకు సంబంధించి బస్సుల్లోకి విద్యార్థులు ఎక్కినప్పటి నుంచి వారు ఇంటికి క్షేమంగా చేరేవరకు అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తూ నిబంధనలు వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.



మంచుతో కప్పకున్న ఆరుబయట ప్రదేశం



మంచుతో కమ్ముకున్న బలిజిపేట రహదారి

- ఉదయం 9గంటల వరకు కనిపించని రహదారులు

కప్పేసిన మంచు దుప్పటి

బలిజిపేట: మండలాన్ని శుక్రవారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. ఎటువైపు చూసినా మంచుమయమైంది. మంచు ప్రభావంతో రహదారులు, ఆరుబయట ప్రదేశాలు కనిపించలేదు. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనారోగ్యవంతులు బయటకు వచ్చేందుకు అవస్థలు పడ్డారు. ఉదయం 9గంటల వరకు మంచు ప్రభావం ఉండడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్యాలయాలకు వెళ్లేవారు అసహనానికి గురయ్యారు. వాహనాలపై వచ్చిపోయే వారికి మంచు ప్రభావం ప్రమాదకరంగా మారింది.

పశుసంపద, పాడిపరిశ్రమతో
ఆర్థికాభివృద్ధి



దూడలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతానగరం:

గ్రామాల్లో పశుసంపద వృద్ధిచెంది పాడి పరిశ్రమతోనే రైతులు ఆర్థిక పరిపుష్టి చెందాలన్నదే ప్రభుత్వ ఆశయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కృష్ణరాయపురంలో పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి మన్మథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషణతో జీవన ప్రమాణాలు పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం వివిధ పథకాలతో పాడి రైతులకు సహాయపడుతోందని చెప్పారు. ఇందులో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఈ ఏడాది 390 వరకు గోకులాల షెడ్ల నిర్మాణాలకు ఉత్తర్వులిచ్చామని తెలిపారు. పశుకిసాన్ రుణ కార్డులను అందజేసి రూ.లక్షా అరవై వేల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా పశు పోషణ నిర్వహణ, పశు గ్రాసాల కోసం సున్నావడ్డీతో రుణాలను అందిస్తున్నామని వెల్లడించారు. సహాయక సంఘ సభ్యులకు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల కొనుగోలుకు రూ.30 వేల వరకు ఆర్థిక సహాయం అందజేసి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా చేయూత నందిస్తున్నామన్నారు. అమలు చేస్తున్న పథకాలపై రైతులు అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి రైతులపై భారం పడకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి పశువులు, జీవాలకుఉచితంగా టీకాలను వేస్తున్నారన్నారు.పశుగ్రాస క్షేత్రాలను నిర్వహించేందుకు రైతులు ముందుకు రాగా తక్షణమే మంజూరు చేయాలన్నారు. వెంకటసాగరం నుంచి రాం కోనేరు వరకు ఆక్రమణలను తొలగించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరగా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు పశుసంచార పశుఆరోగ్య సేవ వాహనాన్ని పరిశీలించి పశు వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మినరల్ పౌడర్, పశుదానా పంపిణీ

కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎస్.మన్మథరావు మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండే విధంగా మినరల్ పౌడర్, పశుదాణాను పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎదకు రాని పశువులు సకాలంలో ఎదకు వచ్చే విధంగా ఉచిత టీకాల కార్యక్రమం, జీవాలకు నులిపురుగు మందులు, టీకాలు, కోళ్లకు వైరస్ సోకుండా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, సర్పంచ్ జి.అన్నంనాయుడు, మాజీ సర్పంచ్ ఆర్.అప్పలనాయుడు, తహసీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ దీనకుమార్, డా. కె.ప్రసాద్, మండలపశువైద్యాధికారులు డాక్టర్ రామారావు, చక్రధర్, జానకిరామ్, గ్రామ సచివాలయ పశువైద్య సహాయకులు, పాడి రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

336పశువులకు చికిత్సలు



పశువులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని భైరిపురం, నూకలవాడ, అరసాడ గ్రామాల్లో మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా 66పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, చూడు పరీక్షలు, 45పశువులకు వైద్యం, మందుల పంపిణీ చేశారు. 225పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు మండల పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. ఇంకా ఏవైనా పశువులు మిగిలిపోతే సిబ్బంది వాటికి తగు పరీక్షలు చేపడతారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ఐక్యతను చాటుదాం

పార్వతీపురంటౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల ఐక్యతను చాటుదాం..పాలసీ దారులకు భద్రత కల్పిద్దామని విశాఖ డివిజన్ ఎల్ఐసీ ఏజెంట్ల ఎన్నికల అధికారి లాడి స్వరూప కుమార్ అన్నారు. జిల్లా ఎల్ఐసీ బ్రాంచ్ పరిధిలో ఏజెంట్ల వృత్తి పరిరక్షణ దినం సందర్భంగా శుక్రవారం ఎల్ఐసీ ఏజెంట్ల సొంత భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏజెంట్ల ఐక్యత ఎంత అవసరమో తెలియజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్వతీపురం బ్రాంచ్ ఎల్ఐసీ అధ్యక్షుడిగా లచ్చిపాత్రుని రామకష్ణ కార్యదర్శిగా మఠ్రాపు నారాయణస్వామి, కోశాధికారిగా కొత్త కోట రమేష్, ఉపాధ్యక్షులుగా చెరుకూరు జగదీశ్వర రావు, గౌరవ అధ్యక్షులుగా పోలిశెట్టి నాగేశ్వరరావు, చెక్కా వెంకట్రావు, గుంట్రెడ్డి జగన్నాథం నాయుడు తో పాటు ఉపాధ్యక్షులుగా ఎం.సన్యాసినాయుడు (రంగనాథ్) మండాది శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా తూముల శ్రీనివాసరావు, తులాల కేశవ రావు, పిట్టల గోపాలరావులను ఎన్నుకున్నారు.



ఎన్నికైన ఎల్ఐసీ ఏజెంట్ల నూతన జిల్లా కార్యవర్గం

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పార్వతీపురం మన్యం జిల్లా గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ మేరకు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో పోలీస్‌శాఖ రిహార్సల్‌ను నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ రాంబాబు, అడ్మిన్ ఆర్ఐవీఎస్ వీడీఆర్‌సీ హెచ్.నాయుడు, పరేడ్ కమాండర్స్ రమేష్,మనోహర్, ఎల్‌పీపీ నాయుడు, సీతానగరం, జియ్యమ్మవలస ఎస్సైలు రాజేష్, ప్రశాంత్‌లు, ప్రభుత్వ బ్రాంచ్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్స్ రిహార్సల్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖకు చెందిన క్రైమ్ డాగ్స్, ఎక్స్‌ప్లోజర్ డాగ్స్ లైకా, బిందు, సాండీ, మ్యాక్స్‌లు నిర్వహించిన రిహార్సల్ అక్కడ ఉన్న వారందరినీ ఆకట్టుకున్నాయి.



రిహార్సల్‌లో డాగ్ స్క్వాడ్

ఈఎంఆర్ఎస్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోగల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అనసభద్ర, కొటికపెంటలో గల కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో 30 మంది బాలురు, 30 మంది బాలికలకు ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు.

అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: మండలంలోని అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులు 6వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.ఎర్రునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30మంది బాలురు, 30మంది బాలికలరు పాఠశాలలో చేరేందుకు అవకాశముందన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9110356741 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

సాలూరు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని బార్‌కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరావు, స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ రాధలు అన్నారు. స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ రాధ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయబాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రవీంద్రభారతి స్కూల్ విద్యార్థినులతో పాఠశాల నుంచి రామా థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న తిరుపతిరావు, రాధలు మాట్లాడుతూ, బాగా చదువుకోవడం ద్వారా విద్యార్థినులు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని సూచించారు. బాల్యవివాహాలు చేసి ఆడపిల్లల తల్లిదండ్రులు వారి జీవితాలను నాశనం చేయరాదన్నారు.



నిర్వహిస్తున్న ర్యాలీ

చేప పిల్లలు విడుదల



చేపపిల్లలు విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంట: మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం గిరిజన–శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ గిరిజన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వేటకు వెళ్లే మత్స్యకారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటిప్రసాద్ బాబు, పాంచాలి సర్పంచ్ గుడెపు యుగంధర్, గిరిజన మత్స్యకార సంఘం అధ్యక్షుడు బచ్చల జోగరాజు పాల్గొన్నారు.

వయోజన విద్యపై వలంటీర్లకు శిక్షణ

సాలూరు రూరల్: మండలంలోని వయోజనులకు విద్య నేర్పించే ఉద్దేశంతో నియమించిన వలంటీర్లకు శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ రమాదేవి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉల్లాస్ వయోజన విద్యపై శిక్షణలో భాగంగా వలంటీర్లకు ఎంపీడీఓ పలు సూచనలు, సలహాలు అందజేశారు. మండలంలో మొదటి విడతగా 1750 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ లక్ష్యం నిర్దేశించిందని ఆమె తెలిపారు. ఈ మేరకు ప్రతి వలంటీర్ తమ పరిధిలో 10 మంది నిరక్షరాస్యులకు రాయడం, చదవడం నేర్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్, మొబైల్ ఫోన్ రిపేరింగ్‌లో శిక్షణ

పార్వతీపురంటౌన్: డ్రైవింగ్, మొబైల్ ఫోన్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ అందజేస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమంలో యువతకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం కేంద్రంలో ఉచిత డ్రైవింగ్, మొబైల్ ఫోన్ రిపేరింగ్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యతోనే కుటుంబాలకు ఆర్థికంగా లబ్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని మహిళలంతా అక్షరాస్యులు కావాలని, అక్షర జ్ఞానంతోనే కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 సంవత్సరాల వయస్సులో ఉన్న నిరక్షరాస్యులైన మహిళలకు ఫైనాషియల్ లిటరసీ, సస్టైన్ బుల్, ఫైనాన్షియల్ లిటరసీపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఒక్కో టీచరు 10 మంది నిరక్షరాస్యులకు విద్యాబోధన అందజేస్తారన్నారు. మండలంలో ఎంపికైన 143 మందికి గాను శుక్రవారం 73 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. శనివారం మరో 70 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన స్వచ్ఛంద వలంటీర్లు గ్రామాల్లో మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, సీసీలు ఎం.నాయుడు, ఆనందరావు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఉమామహేశ్వరరావు

బలిజిపేట: మహిళా సంఘాల్లో ఉండే మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఏపీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, బుక్‌కీపర్లు, సీసీలకు రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి గ్రామాల్లో తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలలో ఉండే నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించేందుకు రూపొందించిన కార్యక్రమమే ఉల్లాస్ అని తెలిపారు. గ్రూపులో ఉండే చదువుకునే సభ్యులు వలంటీర్లుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వారికి ఎటువంటి రెమ్యూనరేషన్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. వారు నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి

సీతానగరం: బాలికలు విద్య, విజ్ఞానం కలిగి ఉన్నప్పుడే కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో'జాతీయ బాలికా దినోత్సవాన్ని ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల ఎదుగుదలకు ఆత్మస్థైర్యం, పట్టుదల ఎంతో అవసరమని నేటి సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ బాలికావిద్య ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ యు.పూర్ణిమ, ఉపాధ్యాయినులు ఐ.పద్మావతి, వి.ప్రమీల, జి.లక్ష్మి, సుభద్రమ్మ, బి.రేణుక, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం మఠ్రాపు రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, రక్షిద్దాం అని పిలుపునిచ్చారు. బాలురుతోపాటు, బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా సహకరిద్దామన్నారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించకుండా, తోటి సోదరిలా చూడాలని చెప్పారు. సమాజానికి వెలుగు ఆడిపిల్లలని అన్నారు. ఆడపిల్ల అంటే భారం కాదని, ఆడపిల్ల అంటే అదృష్టంగా అంతా భావించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వెంటనే కల్పించాలి



డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: ఉపాధి హామీ పనులు మొదలు పెట్టి వలసలు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహన్ రావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం వ్యవసాయ పనులు, పండగ ముగియడంతో గ్రామాల్లో ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వ్యవసాయ కార్మికులు కుటుంబాలతో సహా వలసలు పోతున్నారన్నారు. ఈ వలసలను వెంటనే నివారించాలంటే ఉపాధి పనులు ప్రారంభించాలని కోరారు. జాబ్ కార్డు లేని వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని, రోజువారి కూలీలకు రూ.700 ఇవ్వాలని, ఒక పూటే పని కల్పించాలని, పని ప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్టు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, పలుగు, పారా పనిముట్లు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మవరపు పైడిశెట్టి, ఇ.జీవన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారీతోనే పంచాయతీకి ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె.కుమావర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా సంపద తయారుచేసినప్పుడే పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం చెల్లన్నాయుడువలస, కాశీపేట ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఉత్పత్తి చేస్తున్న సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన తడిచెత్త, పొడి చెత్త ద్వారా తయారుచేస్తున్న వర్మీ కంపోస్టును ఎరువుగా మార్చి బయట విక్రయించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో ఉత్పత్తి చేస్తున్న ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి స్కూల్ బస్‌లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ శశికుమార్

పార్వతీపురం టౌన్: ప్రతి స్కూల్‌బస్‌లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి అని ఎంవీఐ శశికుమార్ అన్నారు. ఈ మేరకు రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 350 మంది స్కూల్ బస్సు, స్కూల్ ఆటో డ్రైవర్స్, సీసీ బస్సు స్టేజ్ క్యారేజ్ బస్సు డ్రైవర్స్‌కు గ్యాస్, ఎలక్ట్రికల్ ద్వారా బస్సులలో జరిగే అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, వాటిని ఆర్పడంపై అవగాహన కల్పించామని తెలిపారు. ప్రతి స్కూల్ బస్‌లో తప్పనిసరిగా అగ్ని ప్రమాదాలను నివారించే యంత్రాలు అమర్చుకోవాలని సూచించారు. మంటలను ఆర్పే యంత్రాలను విధిగా రెన్యువల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేఫ్టీ ఫైర్ ఆఫీసర్ జి.ప్రభాకర రావు, ఏఎంవీఐ టి. ఉమామహేశ్వర రావు, జి.సత్యానారాయణ, ఎస్.రమేష్ కుమార్, బి.కాశీరాం నాయక్, ఎ.వరప్రసాద్ అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.